# తొలివెలుగు

జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 182 | శనివారం | 18-7-2026



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08


## 2020 నాటి ఎన్నికల్లో చైనా జోక్యం

**22 కోట్ల మంది ఓటర్ల వివరాలను అక్రమంగా సేకరించింది**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపాటు**

**ఓటింగ్ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని వెల్లడి**



వాషింగ్టన్: 2020 నాటి అమెరికా ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. అమెరికా ఓటింగ్ వ్యవస్థలో అత్యంత ఆందోళనకరమైన లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన గురువారం రాత్రి వైట్‌హౌస్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రైమ్‌టైమ్ ప్రసంగం చేశారు. దాదాపు అరగంట పాటు మాట్లాడారు.

## విద్యాసంస్థలపై పార్టీలకు, సంస్థలకు పెత్తనం తగదు

**పేపర్ లీకులకు వ్యవస్థదే బాధ్యత**

**దీనిపై రాజకీయ ఏకాభిప్రాయం అవసరం**

**కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు**



డెహ్రాడూన్: దేశంలోని విద్యాసంస్థలపై ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదా సంస్థకు పెత్తనం ఉండరాదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ ఘటనలపై రాజకీయ

### గత విధ్వంసం నుంచి ఏపీని

# కేంద్రమే నిలబెట్టింది

**గత పాలన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కేంద్రమే ఆదుకుందని సీఎం చంద్రబాబు వ్యాఖ్య**

**నరసరావుపేటలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి రుణాల పంపిణీ**

**వివిధ వర్గాల లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల రుణాలు అందజేత**

**కేంద్ర సహకారంతో రాష్ట్రంలోని అధిక వడ్డీ అప్పుల రీషెడ్యూల్ చేశామన్న సీఎం**

**2047 నాటికి ఏపీని హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దుతామని వెల్లడి**

గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్

- మిగతా 2వ పేజీలో





### హరిత రవాణా

# దిశగా ముందడుగు

- దేశంలో మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలు ప్రారంభం
- 'మేక్ ఇన్ ఇండియా'కు ఇది విజయవంతమైన ఉదాహరణ
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

జింద్/జలంధర్: దేశంలో హైడ్రోజన్ ఆధారిత రైలును ప్రారంభించుకోవడం హరిత రవాణా దిశగా కీలకమైన ముందడుగు, 'మేక్ ఇన్ ఇండియా'కు ఒక విజయవంతమైన ఉదాహరణగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. భారత్‌లో మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ఆయన శుక్రవారం హరియాణాలోని జింద్ స్టేషన్‌లో జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. జింద్--సోనిపట్ మార్గంలో ఈ రైలు ప్రయాణిస్తుంది. ప్రపంచంలో హైడ్రోజన్ ఇంధన రైళ్లను నడుపుతున్న అతికొద్ది దేశాల జాబితాలో

- మిగతా 2వ పేజీలో




## ర్యాలీ సక్సెస్ కాకపోతే దెయ్యమై వస్తా

**ఈ నెల 20 దాకా ప్రాణాలతో ఉంటా..**

**తేల్చిచెప్పిన సోనమ్ వాంగ్‌చుక్**

2లో



## అధ్యాపకుల భర్తీలో అవకతవకలు సహించం

**యూనివర్సిటీల్లో అధ్యాపకుల భర్తీ పారదర్శకంగా చేపట్టాలని ఆదేశం**

**అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**పరిశ్రమలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు**

**కెరీర్ గైడెన్స్ కోసం 'నైపుణ్యం' పోర్టల్ ఏర్పాటుకు సన్నాహాలు**

**ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్లేస్‌మెంట్ సెల్స్ ఏర్పాటు చేయాలని సూచన**




## కొత్త అధ్యాయానికి నాంది

- నూతన ఈహెచ్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 886 ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగులకు నగదు రహిత వైద్యం
- పథకం పరిధిలో 1,816 రకాల వైద్యం, శస్త్రచికిత్సలు
- పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులను పట్టించుకోలేదు

ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) నూతన అధ్యాయానికి నాంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 886 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా 8 లక్షల మంది ఉద్యోగులతో పాటు మొత్తంగా 29.80 లక్షల మంది ఉచిత ఇన్‌పేషెంట్ వైద్య సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) ప్యాకేజీ రేట్లకుఅనుగుణంగా 1,816 రకాల వైద్యం, శస్త్రచికిత్సలు ఈ పథకం పరిధిలోకి వస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒక భరోసా, నమ్మకం కలిగిస్తూ, ఎలాంటి భయాందోళనలు లేని ఒక చక్కటి ఆరోగ్య భద్రత వ్యవస్థను అందించాలనేదే సర్కారు ఉద్దేశమన్నారు. ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా పని చేస్తారని, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలవుతాయని,

## ఇరాన్‌పై నిప్పుల వర్షం

**కీలక వంతెనలు, విద్యుత్ వ్యవస్థలపై అమెరికా భీకర దాడులు**

**చాబహార్ ఓడరేవు వద్ద నిఘా టవర్ కూల్చివేత**

**ప్రతీకార చర్యలకు దిగిన ఇరాన్... గల్ఫ్ దేశాలపై వైమానిక దాడులు**

**అమెరికా యుద్ధ విమానాలను నేలమట్టం చేశామన్న ఐఆర్‌జీసీ**

దుబాయ్: పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య దాడులు నానాటికీ తీవ్రతరం అవుతున్నాయి. తాత్కాలిక శాంతి ఒప్పందం అకస్మాత్తుగా ముగిసిన తర్వాత రెండు దేశాలు పరస్పరం కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. ప్రధానంగా హోర్ముజ్ జలసంధిపై ఆధిపత్యం కోసం క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగుతున్నాయి. హోర్ముజ్‌పై టెహ్రాన్ పట్టును సడలించేలా ఒత్తిడి పెంచడానికి బలప్రయోగం తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఇందులో భాగంగా గురువారం అర్ధరాత్రి తర్వాత అమెరికా తన వైమానిక దాడుల పరంపరను మరింత ఉధృతంచేసింది. ఇరాన్‌లో కీలక వంతెనలు, విద్యుత్ వ్యవస్థలపై దాడి చేయడంతోపాటు గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో చాబహార్ ఓడరేవు వద్ద ముఖ్యమైన నిఘా టవర్‌ను కూల్చివేసింది. ఇరాన్ సైతం వెంటనే ప్రతిదాడికి దిగింది.

- మిగతా 2వ పేజీలో



# 2020 నాటి ఎన్నికల్లో చైనా జోక్యం

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో తన ప్రత్యర్థి జో బైడెన్‌కు అనుకూలంగా ఎన్నికలను ప్రభావితం చేయడానికి చైనా కుట్రలు సాగించిందని, ఆ విషయాన్ని నిర్ధారించే వందలాది నిఘా ఫైళ్లను తాను బహిర్గతం చేశానని చెప్పారు. ^న వ్యక్తిగత సమాచారంతో సహా 22 కోట్ల మంది ఓటర్ల వివరాలను చైనా అక్రమంగా సేకరించిందని మండిపడ్డారు. 18 రాష్ట్రాల్లోని ఓటర్ల డేటాను చైనా కొనుగోలు చేసిందని, దొంగిలించిందని లేదా హ్యాక్ చేసిందని ట్రంప్ అన్నారు. ఈ విషయాన్ని నిఘా అధికారులు ప్రభుత్వానికి గానీ, కాంగ్రెస్‌కు గానీ చెప్పలేదని నిందించారు. అమెరికా పౌరులు కాని 2,78,000 మంది ఓటర్లుగా నమోదైనట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం గుర్తించిందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో ఓటర్లకు సంబంధించిన సమాచారం చాలావరకు బహిరంగంగానే అందుబాటులో ఉంటుంది. అయితే, ఓటింగ్ విధానాలను మార్చడానికి లేదా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడానికి చైనా ఈ సమాచారాన్ని వాడుకుందని తేల్చడానికి ట్రంప్ ఎటువంటి ఆధారాలనూ చూపలేదు. 2020 నాటి ఎన్నికల్లో జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, విదేశీ జోక్యం వల్ల ఫలితాలు తారుమారు అయ్యాయని ఆయన పదేపదే ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. అందుకు సాక్ష్యాధారాలను మాత్రం బయటపెట్టడం లేదు. మరోవైపు, కాంగ్రెస్‌పై నియంత్రణను నిర్ణయించే రాబోయే మధ్యంతర ఎన్నికలపై ప్రజల్లో సందేహాలు రేకెత్తించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని విపక్ష డెమోక్రాట్లు ఆరోపిస్తున్నారు. 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకోలేదని బలమైన నమ్మకం ఉన్నట్లు అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ కౌన్సిల్ 2021 నాటి నివేదికలో పేర్కొంది. ఇదిలా ఉండగా, ట్రంప్ ప్రజామోద రేటింగ్ 37 శాతానికి పడిపోయినట్లు వాషింగ్టన్ పోస్ట్--ఇప్సోస్ నిర్వహించిన తాజా సర్వేలో తేలింది. జీవన వ్యయం పెరగడం, ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం పట్ల చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడయ్యింది. తన ప్రసంగాన్ని తప్పనిసరిగా ప్రత్యక్ష ప్రసారం చేయాలని మీడియా సంస్థలకు ట్రంప్ తేల్చిచెప్పారు. ప్రత్యక్ష ప్రసారం చేయకపోతే ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అమెరికాలోని ప్రసార, కేబుల్ వార్తా సంస్థలు అత్యంత క్లిష్టమైన పరిస్థితి ఎదుర్కొన్నాయి. ప్రసారం చేయాలా? వద్దా? అనేదానిపై ఎటూ తేల్చుకోలేకపోయాయి. అమెరికా మీడియా సంస్థల్లో తన వ్యతిరేకులు ఉన్నారని ట్రంప్ చాలా రోజులుగా ఆక్షేపిస్తున్నారు. మీడియాపై పట్టు బిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. "మీడియా సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయి. అలాంటి సంస్థల లైసెన్సులను రద్దు చేయాలి. కోట్లాది డాలర్ల విలువైన మన ప్రజా ఆస్తి ఎయిర్‌వేవ్స్‌ను (ప్రసార తరంగాలను) ఎలాంటి రుసుమూ చెల్లించకుండానే వాడుకుంటున్నాయి. మాకు కావాల్సిందల్లా ఎన్నికలు, వార్తల ప్రసారంలో నిజాయితీ మాత్రమే"అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, ట్రంప్ ప్రసంగాన్ని కొన్ని చానళ్లు ప్రత్యక్ష ప్రసారం చేయగా, మరికొన్ని చేయలేదు.

## అధ్యాపకుల భర్తీలో అవకతవకలు సహించం

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, ఏ చిన్న ఉల్లంఘన జరిగినా బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీలో విశ్వవిద్యాలయాలు, వైస్ ఛాన్సలర్లు పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల కోసం మొత్తం 1,90,509 దరఖాస్తులు రాగా, వాటిలో 1,51,836 అర్హమైనవిగా తేల్చినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అర్హతలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని ఈ నెల 21వ తేదీ వరకు స్వీకరించి, 27వ తేదీన అర్హుల తుది జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. ఇంటర్వ్యూల ప్రక్రియను కూడా ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా నిర్వహించాలని లోకేశ్ ఆదేశించారు. ప్రైవేటు యూనివర్సిటీల అనుమతుల విషయంలో యూజీసీ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన సెట్ల నిర్వహణను వేగవంతం చేసి, సకాలంలో అడ్మిషన్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షించిన మంత్రి, ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1.37 లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. యువతకు మరింత సౌలభ్యంగా ఉండేలా జాబ్ మేళాలను కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఐటీఐని ఏదో ఒక పరిశ్రమతో అనుసంధానించి, స్కిల్ గ్యాప్‌ను భర్తీ చేయాలని ఆదేశించారు. రాష్ట్రానికి కొత్తగా రాబోయే పరిశ్రమలకు అవసరమైన వర్క్ ఫోర్స్‌ను సిద్ధం చేసేందుకు నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని, ఇందుకుగాను 81 ఇండస్ట్రీ-అకాడెమియా భాగస్వామ్యాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించేలా 'నైపుణ్యం పోర్టల్'ను తీర్చిదిద్ది, వచ్చే నెలలో ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. ఈ పోర్టల్ ద్వారా విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే ఉద్యోగావకాశాలు, అవసరమైన నైపుణ్యాలపై సమాచారం అందుతుందని అధికారులు వివరించారు. ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్‌లో స్కిల్ పాస్‌పోర్టు అందించడంతో పాటు, రాష్ట్రంలోని 169 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్లేస్‌మెంట్ సెల్స్ ఏర్పాటు చేయాలని లోకేశ్ సూచించారు.

## ర్యాలీ సక్సెస్ కాకపోతే దెయ్యమై వస్తా

న్యూఢిల్లీ: పర్యావరణవేత్త, సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష శుక్రవారం 20వ రోజుకు చేరుకుంది. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే దాకా పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనైనా ఈ నెల 20వ తేదీ వరకు ప్రాణాలతో ఉంటానని స్పష్టం చేశారు. ఈ నెల 20న జరిగే ర్యాలీని విజయవంతం చేద్దామని అన్నారు. ఆయన ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద దీక్షా స్థలంలో తన మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడారు. తన శారీరక పరిస్థితి క్షీణిస్తున్నప్పటికీ సంకల్పం మాత్రం చెక్కుచెదరలేదని అన్నారు. "నేను పైకి బలహీనంగా కనిపించినా, అంతర్గతంగా చాలా దృఢంగా ఉన్నాను. మీరందరూ కూడా అంతర్గతంగా, బాహ్యంగానూ దృఢంగా ఉన్నారని నాకు నమ్మకం ఉంది. జూలై 20న పార్లమెంట్ వరకు శాంతియుత ర్యాలీని నిర్వహించబోతున్నాం. మనమంతా కలిసి వెళ్లి, ప్రజాస్వామ్య దేవాలయం వంటి పార్లమెంట్‌లో మన విజ్ఞాపనను సమర్పిద్దాం"అని వాంగ్‌చుక్ పిలుపునిచ్చారు. ఆ రోజు ప్రజలు రాకపోయినా, ర్యాలీ విజయవంతం కాకపోయినా దెయ్యమై తిరిగివస్తానని తేల్చిచెప్పారు. వాంగ్‌చుక్ గత 24 గంటల వ్యవధిలో 350 గ్రాముల బరువు తగ్గారు. దీక్ష మొదలైనప్పటి నుంచి ఆయన బరువు 9.5 కిలోలు తగ్గిపోయింది. ఆయనలో స్వల్పంగా డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించినప్పటికీ మానసికంగా చురుగ్గానే ఉన్నారని డాక్టర్లు తెలిపారు.

# హరిత రవాణా దిశగా ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)



భారత్ కూడా చేరింది. మోదీ హరియాణాలో రూ.14,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రసంగించారు. హైడ్రోజన్ రైలు ఆత్మనిర్భర్ భారత్, ఆధునిక రవాణా వ్యవస్థ పట్ల మన నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. గతంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల తలెత్తిన పరిస్థితులు ఒకవేళ 2014కు ముందే ఏర్పడి ఉంటే భారతీయ రైల్వేల కార్యకలాపాలు స్తంభించిపోయేవని పేర్కొన్నారు. ఎందుకంటే అప్పట్లో దేశంలోని చాలా ప్రాంతాల్లో రైళ్లు ప్రధానంగా డీజిల్‌తో నడిచేవని గుర్తుచేశారు. అప్పట్లో డీజిల్ సరఫరాకు అంతరాయం కలిగి ఉంటే డీజిల్ ఆధారిత రైళ్లు ఆగిపోయేవని పేర్కొన్నారు. దేశం భారీ సంక్షోభాన్ని ఎదుర్కొనేదని చెప్పారు. కానీ, ఇది 2014 నాటి పరిస్థితి కాదన్నారు. "సమస్యలకు పరిష్కారాలను ముందుగానే ఆలోచించి, వాటిని క్షేత్రస్థాయిలో వాస్తవ రూపంలోకి తీసుకువచ్చే వ్యక్తి మోదీ. పశ్?చమాసియా నేడు రణరంగంగా మారింది. హోర్ముజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో యుద్ధం కొనసాగుతోంది. యుద్ధం, చమురు సంక్షోభం ఉన్నప్పటికీ భారత రైల్వేలు, దేశ అభివృద్ధి పరుగు మాత్రం ఆగిపోలేదు"అని వ్యాఖ్యానించారు. "హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడిపే సామర్థ్యం కేవలం మూడు లేదా నాలుగు దేశాలకు మాత్రమే ఉంది. 21వ శతాబ్దపు ఈ సాంకేతికత విషయంలో భారతీయ రైల్వే ఒక పెద్ద ముందడుగు వేసింది. ఈ రైలు 3,200 హార్స్‌పవర్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది అత్యంత శక్తివంతమైనదే కాకుండా అత్యంత పొడవైనది(10 కోచ్‌లు) కూడా. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో హైడ్రోజన్ రైలుకు కేవలం మూడు లేదా నాలుగు కోచ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ, మన దేశంలో ఈ రైలుకు 10 కోచ్‌లు ఉన్నాయి. ఈ భారీ హైడ్రోజన్ రైలును నడపడం ద్వారా భారత్ ప్రపంచ వేదికపై తనదైన ముద్ర వేసింది. భవిష్యత్తులో హైడ్రోజన్ రైలుకు సంబంధించిన మరిన్ని మౌలిక సదుపాయాలు రాబోతున్నాయి. జింద్ పట్టణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం విజయవంతం కావడం హర్షణీయం. స్వచ్ఛతను ప్రజలు తమ జీవన విధానంలో, దైనందిన జీవితంలో ఒక అంతర్భాగంగా మార్చుకోవాలి. జింద్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉంది. ఇది మహారాజా రంజిత్ సింగ్ కీర్తితోనూ, పాండవులకు సంబంధించిన విశ్వాసంతోనూ ముడిపడి ఉన్న ప్రాంతం. ఈ వారసత్వాన్ని కాపాడుకోవడమే కాకుండా, దానిని గర్వంగా భావి తరాలకు అందించడానికి భారత్ కట్టుబడి ఉంది. ఇదే స్ఫూర్తితో కురుక్షేత్రలో ఈ రోజు ఒక సిక్కు మ్యూజియంకు శంకుస్థాపన చేశాం.

# కొత్త అధ్యాయానికి నాంది

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. శుక్రవారం సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహతో కలిసి కొత్త ఈహెచ్ఎస్ పథకాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధికి ఈ పథకమే నిదర్శనం. ఉద్యోగులు కూడా కుటుంబ సభ్యులే. వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలై, వాటిని తీర్చలేక సతమతమవుతున్న దుస్థితిని గమనించాం. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి కొత్త ఆరోగ్య పథకాన్ని తీసుకొచ్చింది. అలాగే రాష్ట్రంలో అర్హులైన 1.06 కోట్ల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. దీని పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. రాష్ట్ర సాధన కోసం ఉద్యోగులు చేసిన కృషిని మరవలేము. అలాంటి ఉద్యోగుల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పదేళ్లలో రూ.10 వేల కోట్లు అప్పు చేసింది కానీ ఉద్యోగుల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసింది. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు రూ.10 వేల కోట్ల బిల్లులను మా ప్రభుత్వం మానవీయ కోణంలో క్లియర్ చేస్తోంది. పెండింగ్ బిల్లులను నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేస్తున్నాం. ప్రతి 15 రోజులకోసారి నేను స్వయంగా సమీక్షిస్తున్నా..'అని భట్టి చెప్పారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ.. 20 ఏళ్ల ఆకాంక్ష ప్రజా ప్రభుత్వంలో నెరవేరిందని చెప్పారు. నగదు రహిత వైద్య సేవలు చరిత్రాత్మక నిర్ణయమన్నారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్, ప్రధాన కార్యదర్శి మార జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'ఇదొక శుభదినం'అని అన్నారు. 20 ఏళ్ల కల ఈ రోజు నెరవేరిందన్నారు. ఉద్యోగుల 64 సమస్యల్లో 35 ప్రభుత్వం పరిష్కరించిందని చెప్పారు.

## విద్యాసంస్థలపై పార్టీలకు, సంస్థలకు పెత్తనం తగదు

(మొదటి పేజీ తరువాయి)

ఏకాభిప్రాయం అవసరమని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన చెప్పారు. శుక్రవారం సాయంత్రం డెహ్రాడూన్‌లో ఆయన కాంగ్రెస్ చేపట్టిన చాత్రోం కీ గుంజ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యావ్యవస్థలో అట్టడుగు నుంచి అత్యున్నత స్థాయి వరకు ప్రతి ఒక్కరూ పేపర్ లీకేజీలకు కారణమని, వీటి కారణంగా ఇప్పటి వరకు కనీసం 7.5 కోట్ల మంది విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. కోచింగ్ సెంటర్లు, పరీక్ష కేంద్రాలు, పేపర్ రూపకల్పన చేసేవారు, ట్రాన్స్‌లేటర్లు, రవాణాదారులు, విక్రేతలు ఇంకా, ఎన్‌టీఏ, అన్నిటికంటే పైన విద్యాశాఖ మంత్రి సహా మొత్తం వ్యవస్థ అంతా ఈ అక్రమాలకు కారణమయ్యారని ఆరోపించారు. వీరిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తాము ప్రశ్నిస్తున్నామన్నారు. 'మన విద్యాసంస్థలు స్వతంత్రంగా ఉండాలి. ఏ ఒక్క రాజకీయ పార్టీ, లేదా సంస్థ మన విద్యాసంస్థలపై పెత్తనం చేయరాదు.



## గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

(మొదటి పేజీ తరువాయి)

ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఛీూూ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై నిప్పుల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఖతార్, కువైట్, జోర్డాన్‌పై క్షిపణులు ప్రయోగించింది. బహ్రెయిన్, ఒమన్, సిరియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కువైట్‌లో విద్యుత్, నీటి శుద్ధి ప్లాంట్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉత్పాదన యూనిట్లకు నష్టం వాటిల్లిందని కువైట్ ఆందోళన వ్యక్తంచేసింది. గల్ఫ్‌లో అమెరికా యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) ప్రకటించింది. జోర్డాన్‌లో మోహరించిన అమెరికా యుద్ధ విమానాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణి, డ్రోన్ దాడులు జరిపినట్లు స్పష్టంచేసింది. ఈ దాడుల్లో పలు అమెరికన్ యుద్ధ విమానాలు, గగనతల ఇంధన సరఫరా విమానాలు ధ్వంసం కాగా, మరికొన్ని తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొంది. అయితే, తమ భూభాగం మీదుగా వచ్చిన మూడు క్షిపణులను అడ్డుకొని, కూల్చివేసినట్లు జోర్డాన్ సైన్యం తేల్చిచెప్పింది. ఇరాన్‌లోని దక్షిణ హోర్ముజ్‌గాన్ ప్రావిన్స్‌లో వంతెనలపై



అమెరికా సైన్యం వైమానిక దాడులకు దిగింది. ఈ దాడుల్లో కనీసం ఏడుగురు మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ టీవీ వెల్లడించింది. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ తీర నగరమైన బందర్ ఖమీర్‌పైనా దాడులు జరిగాయి. ప్రధాన రహదారులు, రైల్వే వంతెనలను కూడా విడిచిపెట్టలేదు. ప్రధాన రేవు పట్టణమైన బందర్ అబ్బాస్, రాజధాని టెహ్రాన్ మధ్య అనుసంధానం లేకుండా చేయడమే అమెరికా లక్ష్యంగా కనిపిస్తోంది. తమ దేశంలో విద్యుత్ మౌలిక సదుపాయాలపై దాడులు జరిగినట్లు ఇరాన్ అంగీకరించింది. దక్షిణ ప్రావిన్స్‌లలో ప్రజలు విద్యుత్‌ను చాలా పొదుపుగా వాడుకోవాలని ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ పిలుపునిచ్చింది. ఇరాన్‌లో పదుల సంఖ్యలో లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు అమెరికా సైనిక దళాల సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. వరుసగా ఆరో రోజు ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్లు వెల్లడించింది. అమెరికా వైమానిక దాడిలో చాబహార్ ఓడరేవు వద్ద ఒక టవర్ కూలిపోయినట్లు ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తెలియజేసింది. ఓడరేవులోకి వచ్చే నౌకలను ఈ టవర్ నుంచే పర్యవేక్షిస్తారు. నిఘా టవర్ కూలిపోతున్న ఫొటోను అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. భారత ప్రభుత్వ సహకారంతో ఇరాన్ నిర్వహిస్తున్న చాబహార్ ఓడరేవు అమెరికా దాడులకు పదేపదే లక్ష్యంగా మారుతోంది. ఇక్కడ దాడులు జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా సైతం ధ్రువీకరించింది.

# నేతన్న కూతురు.. నీట్ టాపర్!

- కష్టాలను జయించి.. డాక్టర్ చదువుకు..
- బీసీ-బీ కేటగిరీలో 408వ ర్యాంకు సాధించిన సంజన
- చేనేత కార్మికుడి కుమార్తె ఘనతపై సర్వత్రా ప్రశంసలు



**తొలివెలుగు, రాజపేట:** మండల కేంద్రమైన రాజపేటకు చెందిన సకినాల సంజన జాతీయ స్థాయి వైద్య విద్యా ప్రవేశ పరీక్ష (నీట్)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. సకినాల చిరంజీవులు, మాధవి దంపతుల కుమార్తె అయిన సంజన.. నీట్ ఫలితాల్లో బీసీ–బీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 408వ ర్యాంకు సాధించి రికార్డు సృష్టించింది. ఈ ర్యాంకుతో ఆమెకు ఉచిత ఎంబీబీఎస్ సీటు లభించే అవకాశం ఉంది. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లోనూ జనగామ ఏబీవీపీ కళాశాలలో చదివిన సంజన 989 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. తండ్రి పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తున్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సంజన సాధించిన ఈ విజయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి, పట్టుదలతో చదివి గ్రామానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చిపెట్టడం గర్వకారణమని కొనియాడారు. ఈ సందర్భంగా సంజనను రాజపేట శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటరమణ, జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు ఆడెపు శ్రీశైలం ఘనంగా అభినందించి, ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## నీట్‌లో పుట్టగూడెం విద్యార్థుల ఘన విజయం

- ఎస్టీ కేటగిరీలో ప్రభాస్‌కు 638వ ర్యాంకు.. ఉదయ్‌కు 4,000వ ర్యాంకు
- ఉచిత ఎంబీబీఎస్ సీట్లు సాధించడంపై సర్వత్రా హర్షం

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి వైద్య విద్యా ప్రవేశ పరీక్ష (నీట్)లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. గ్రామానికి చెందిన మాలోతు కిషన్ కుమారుడు మాలోతు ప్రభాస్ నీట్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో జాతీయ స్థాయిలో 638వ ర్యాంకు సాధించి రికార్డు సృష్టించారు. అదేవిధంగా, మాలోతు విజయ్ కుమారుడు ఉదయ్ 4,000వ ర్యాంకు సాధించి ఉచిత ఎంబీబీఎస్ సీటును దక్కించుకున్నారు. పేద రైతు కుటుంబాలకు చెందిన ఈ ఇద్దరు విద్యార్థులు పట్టుదలతో శ్రమించి ఈ ఘనత సాధించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాలోతు విఠల్ నాయక్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థులు కష్టపడి చదివి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం పుట్టగూడెం గ్రామానికే గర్వకారణమని ఆయన కొనియాడారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభాస్, ఉదయ్‌లు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని ఆయన ప్రశంసించారు.

## రాజపేటలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి

- ఇద్దరు నిందితుల అరెస్టు.. రెండు ట్రాక్టర్లు, ట్రాలీల స్వాధీనం
- రఘునాథపురం వాగు వద్ద తెల్లవారుజామున తనిఖీలు

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, రెండు ట్రాక్టర్లు, ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రఘునాథపురం వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారంతో రాజపేట పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ జి. ప్రభాకర్ నాయుడు తన సిబ్బందితో కలిసి ఉదయం 6 గంటల ప్రాంతంలో వాగు వద్దకు చేరుకుని నిఘా పెట్టారు. ఈ తనిఖీల్లో ఇసుక లోడ్ చేసి ఉన్న టీజీ–30–టీ–3404 నంబరు గల ట్రాక్టర్, టీజీ–30–టీ–3405 ట్రాలీతో పాటు, ఇసుక లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న టీఎస్–27–టీ–1132 ట్రాక్టర్, టీఎస్–27–టీ–1133 ట్రాలీని పోలీసులు గుర్తించారు. అక్కడ ఉన్న వ్యక్తులను నిలదీయగా, ఇసుక తరలింపునకు సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు చూపించలేకపోయారు. పోలీసుల ప్రాథమిక విచారణలో.. యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బుడిగె ప్రభాకర్ తన స్వంత ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు నిర్ధారణ అయింది. అలాగే అదే గ్రామానికి చెందిన బొంత మల్లేష్ అనే డ్రైవర్ తన యజమాని బేదరబోయిన శ్రీకాంత్ ఆదేశాల మేరకు ఇసుక తరలిస్తున్నట్లు అంగీకరించాడు. పోలీసులు నిందితుల వాంగ్మూలాన్ని నమోదు చేసి, పంచనామా నిర్వహించిన అనంతరం వాహనాలను స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## రాజపేటలో 92 శాతం ఓటర్ల ఫారాల ప్రక్రియ పూర్తి

- నాలుగు రోజుల్లో 96 శాతం లక్ష్యం: తహసిల్దార్ రవికిరణ్
- మండలంలో 29,805 ఫారాల పంపిణీ
- మరో నాలుగు రోజుల్లో 96 శాతానికి చేరనున్న ప్రక్రియ



**తొలివెలుగు, రాజపేట :** ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా రాజపేట మండలంలో ఇప్పటివరకు 92 శాతం ఓటర్ల ఫారాలను సేకరించినట్లు తహసిల్దార్ గోలి రవికిరణ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో వివరాలు వెల్లడించారు. మండల వ్యాప్తంగా మొత్తం 29,805 ఫారాలను ఓటర్లకు అందజేసి, వారి నుంచి వివరాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నామని, మరో నాలుగు రోజుల్లో 96 శాతం ఓటర్ల నుంచి భర్తీ చేసిన ఫారాల స్వీకరణ పూర్తి కానుందని తహసిల్దార్ వివరించారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు నిర్దేశిత గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి






- సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య సూచన
- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా న్యాయ అవగాహన సదస్సు

**తొలివెలుగు, రామన్నపేట:** విద్యార్థులు చదువుపై పూర్తి శ్రద్ధ వహించడంతో పాటు దేశంలోని చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య సూచించారు. రామన్నపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఒక ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన పెంచుకోవడం వల్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి వీలవుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఏజీపీ సుక్క శ్రావణ్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతలను గుర్తించి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. విద్యాహక్కు చట్టం, బాల కార్మిక నిషేధ చట్టం, కార్మిక చట్టాలు, బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టం మరియు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల వంటి కీలక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వక్తలు స్పష్టం చేశారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, త్వరలోనే ప్రతి పాఠశాలలో చట్టాలకు సంబంధించిన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి అందులో విద్యార్థులను భాగస్వాములను చేస్తామని మెజిస్ట్రేట్ వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా స్థానిక పోలీస్ స్టేషన్ లేదా మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సురేందర్ రెడ్డి, లీగల్ సర్వీసెస్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, అధ్యాపకులు శేషాచారి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎండి జరీనా, ఎన్. విజయ, కె. శ్రీలక్ష్మి, బి. నాగమణి, ఎండి అజీజ్, ఎండి రహిమున్నీసా, ఓఎస్‌లు ఆర్. రవి, చక్రపాణి, కోర్టు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భూదాత ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి





- ఘనంగా వెదిరే రామచంద్రారెడ్డి 120వ జయంతి వేడుకలు
- ఇంటర్నేషనల్ ట్రస్టు ద్వారా విస్తృత సేవలు: వెదిరే అరవింద రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** ప్రపంచ ప్రథమ భూదాత వెదిరే రామచంద్రారెడ్డి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ ముందుండాలని జాతీయ సర్వోదయ సేవా సంఘం అధ్యక్షుడు వెదిరే అరవింద రెడ్డి అన్నారు. భూదాన్ రామచంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం పురపాలక కేంద్రంలో రామచంద్రారెడ్డి 120వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అరవింద రెడ్డి.. చౌటుప్పల్ చౌరస్తా వద్ద ఉన్న రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహానికి, వినోబా మందిర్ వద్ద ఉన్న ఆచార్య వినోబా భావే, వెదిరే రామచంద్రారెడ్డిల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆనాడు ఆచార్య వినోబా భావే పిలుపుతో ఒక్క మాటపై 100 ఎకరాల భూమిని దానం చేసిన మహానుభావుడు రామచంద్రారెడ్డి అని కొనియాడారు. ఆయన త్యాగనిరతిని, స్ఫూర్తిని ప్రపంచ స్థాయికి చాటేందుకు తమ కుటుంబ సభ్యులంతా కలిసి 'వెదిరే ఇంటర్నేషనల్ ట్రస్టు' ద్వారా 'సేవ–సమైక్యవాదం' నినాదంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా పోచంపల్లిలో త్వరలోనే పలు నూతన సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. సమాజంలో నిరుపేదరికం నిర్మూలన, శాంతి స్థాపన కోసం తమ సొంత నిధులతో హిందూ, ముస్లిం, క్రైస్తవ ప్రార్థనా మందిరాలలో నిత్య పూజలు, పఠనాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఏ ఒక్క నిరుపేద కూడా పస్తులుండకూడదనే లక్ష్యంతో అన్నదాన కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. రామచంద్రారెడ్డి సేవాసమితి సెక్రటరీ కరగల్ల కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు తలుపునూరి కృష్ణ గౌడ్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గునిగంటి మల్లేష్ గౌడ్, శాలివాహన సంఘం నాయకుడు వంగూరి రాజు, మోట రాజు, కొమ్ము లక్ష్మణ్, నల్ల నాగేశ్వర్, కుక్క మారయ్య, పెద్దలు నరసింహ, ఎడ్ల లింగస్వామి, కరగల్ల రాము, మల్లయ్య, బాలరాజు, యాదగిరి, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి!

- ట్రినిటీ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థులకు సూచించిన సీఐ వెంకటేశం

**తొలివెలుగు, చౌటుప్పల్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ నందగిరి వెంకటేశం సూచించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని ట్రినిటీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశం మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు తాము మాత్రమే కాకుండా తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, వేగ నియంత్రణ పాటించడం వంటి అలవాట్లు ప్రాణాలను కాపాడుతాయని తెలిపారు. విద్యార్థులకు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని, ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడరాదని, మలుపుల వద్ద ఇండికేటర్లను తప్పనిసరిగా ఉపయోగించాలని, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలపరాదని, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని సవివరంగా వివరించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తామని విద్యార్థులతో సీఐ వెంకటేశం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల, ట్రాఫిక్ ఎస్ఐ జీ సైదిరెడ్డి, ఆర్ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ జంగయ్య, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విలువైన అవగాహన కల్పించినందుకు సీఐ వెంకటేశాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.








# కేకే కమిటీ సమావేశానికి తరలివెళ్లిన రాజపేట ఉద్యమకారులు


- సంక్షేమ చర్యలు చేపట్టాలని కమిటీకి వినతిపత్రం సమర్పణ

- గౌరవ పింఛన్, ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్

**తొలివెలుగు, రాజపేట:** తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజాపేట మండలానికి చెందిన ఉద్యమకారులు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన కే.కే. కమిటీ సమావేశంలో వారు పాల్గొని తమ నిరసనను ప్రదర్శన ద్వారా వ్యక్తపరిచారు. స్వరాష్ట్ర సాధనలో తాము చేసిన సేవలను గుర్తించి, తగిన గౌరవంతో పాటు సంక్షేమ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీ సభ్యులను కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ.. ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ప్రతి కార్యకర్తకూ న్యాయం చేయాలన్నారు. అర్హులైన ఉద్యమకారులందరికీ గౌరవ పింఛన్, ఉచిత వైద్య సదుపాయాలు, ఇంటి స్థలాలు, ప్రత్యేక గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. తమ సమస్యలపై కమిటీ సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యమకారులు మారోజు కుమారస్వామి, పెంట సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు ఠాకూర్ హిమ్మత్ సింగ్, రామిల్ల నరేందర్, సందిలా భాస్కర్ గౌడ్, కాకాల ఉపేందర్, చింతల దాసు, ఆకిరెడ్డి నరసింహులు, ఉచ్చేంతల బాలయ్య, కాయితి బాల్రెడ్డి, నీల బిక్షపతి, రాంగోళ్ల శ్రీనివాస్, తునికి బిక్షపతి, రంగా నరేష్ గౌడ్, సుధాకర్ రెడ్డి, ఉమా, శివ శంకర్, మాడోతు శంకర్ నాయక్, వేముల గోపి తదితరులు పాల్గొన్నారు.

# రాజపేటలో 92 శాతం ఓటర్ల ఫారాల ప్రక్రియ పూర్తి

- నాలుగు రోజుల్లో 96 శాతం లక్ష్యం: తహసిల్దార్ రవికిరణ్
- మండలంలో 29,805 ఫారాల పంపిణీ
- మరో నాలుగు రోజుల్లో 96 శాతానికి చేరనున్న ప్రక్రియ



**తొలివెలుగు, రాజపేట :** ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా రాజపేట మండలంలో ఇప్పటివరకు 92 శాతం ఓటర్ల ఫారాలను సేకరించినట్లు తహసిల్దార్ గోలి రవికిరణ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో వివరాలు వెల్లడించారు. మండల వ్యాప్తంగా మొత్తం 29,805 ఫారాలను ఓటర్లకు అందజేసి, వారి నుంచి వివరాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నామని, మరో నాలుగు రోజుల్లో 96 శాతం ఓటర్ల నుంచి భర్తీ చేసిన ఫారాల స్వీకరణ పూర్తి కానుందని తహసిల్దార్ వివరించారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు నిర్దేశిత గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

# బోగారంలో స్వచ్ఛందంగా మద్యం విక్రయాల నిలిపివేత

- గ్రామ సర్పంచ్‌కు రాతపూర్వక తీర్మాన పత్రం అందజేసిన బెల్ట్‌షాపు యజమానులు
- ఆరోగ్యం, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమంటూ ఆదర్శ నిర్ణయం



**తొలివెలుగు, రామన్నపేట:** గ్రామ ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలను పరిరక్షించడమే ధ్యేయంగా రామన్నపేట మండలంలోని బోగారం గ్రామ బెల్ట్ షాపు నిర్వాహకులు శ్లాఘనీయమైన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు వారు స్వచ్ఛందంగా ప్రకటించారు. ఈ మేరకు ఒక రాతపూర్వక తీర్మానాన్ని రూపొందించి, గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ గౌడ్ తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా బెల్ట్‌షాపు యజమానులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు కుటుంబాల సంక్షేమం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. గ్రామ శ్రేయస్సు కోసం అడుగులు వేసిన బెల్ట్‌షాపు యజమానులను సర్పంచ్, వార్డు సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ నిర్ణయానికి గ్రామస్థులందరూ సహకరించి, బోగారాన్ని త్వరలోనే సంపూర్ణ మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సహకార సంఘం అధ్యక్షుడికి ఘన సన్మానం

- భక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన భరత లవ కుమార్ కు శుక్రవారం పురపాలక కేంద్రంలో ఘన సన్మానం జరిగింది. స్థానిక భక్తాంజనేయ స్వామి దేవాలయ పాలకవర్గం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బల్ల దుర్వాసులు నేతృత్వంలో లవ కుమార్ కు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదాశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రతినిధులు వనం ఉభయాకర్, అంబటి భాను, వీడం చక్రపాణి, కొంక వీరేశం, సామల కైలాసం, గర్దాసు ఉప్పలయ్య, బైరు లక్ష్మయ్య, ఏరువా విగ్నేష్, ఆడపు ఎల్లమ్మ, గంజి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# దిల్‌సుఖ్‌నగర్‌లో 'మాంగళ్య' షాపింగ్ మాల్ ప్రారంభం





- 32వ శాఖను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన సినీ నటి మీనాక్షి చౌదరి
- నాణ్యత, సరసమైన ధరలే మా విజయరహస్యం: సంస్థ డైరెక్టర్లు

**తొలివెలుగు, ఎల్‌బీనగర్ :** తెలంగాణలో వరంగల్‌ను కేంద్రంగా ప్రారంభమైన మాంగళ్య షాపింగ్ మాల్ వస్త్ర వ్యాపార రంగంలో వేగంగా విస్తరిస్తూ మరో మైలురాయిని చేరుకుంది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో విజయవంతంగా సేవలందిస్తున్న మాంగళ్య షాపింగ్ మాల్ శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో తన 32వ శాఖను ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న వస్త్ర కలెక్షన్‌ను పరిశీలించారు. అభిమానులతో కలిసి సందడి చేస్తూ ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. దిల్‌సుఖ్‌నగర్ ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు విశేష ఆదరణ అందిస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదాలతో ఈ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహమూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయానికి ప్రధాన కారణమన్నారు. తమ స్వంత హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఆధునిక ఫ్యాషన్ ధోరణులకు అనుగుణంగా రూపొందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొందుతున్నామని తెలిపారు. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్‌ను త్వరలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మరో 10 కొత్త శాఖలను ప్రారంభించనున్నట్లు, అనంతరం తమిళనాడుకు కూడా విస్తరించే ప్రణాళిక ఉన్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే కోదాడలో 33వ శాఖను ప్రారంభించనున్నట్లు తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రజలు వివాహాలు, శుభకార్యాల కోసం ఒకే చోట కుటుంబ సమేతంగా షాపింగ్ చేయగలిగే విధంగా అత్యాధునిక సౌకర్యాలతో మాల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇకపై పెళ్లి షాపింగ్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల నాణ్యమైన వస్త్రాలు ఇక్కడే అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**పెళ్లిళ్లు, శుభకార్యాలకు ప్రత్యేక కలెక్షన్లు:**

మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, చిన్నారుల కోసం తాజా ఫ్యాషన్ దుస్తులు, సంప్రదాయ వస్త్రాలు, వెడ్డింగ్ కలెక్షన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రూ.99 నుంచి రూ.1 లక్ష వరకు వివిధ ధరల శ్రేణిలో వస్త్రాలు అందుబాటులో ఉండటంతో అన్ని వర్గాల వినియోగదారులకు అనువైన షాపింగ్ కేంద్రంగా మాంగళ్య షాపింగ్ మాల్ నిలుస్తోంది. వివాహాలు, శుభకార్యాల కోసం ఒకే చోట అన్ని రకాల వస్త్రాలు లభించే ఫ్యామిలీ షాపింగ్ డెస్టినేషన్‌గా ఈ మాల్ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.





# జిల్లా ఉత్తమ ఆశా కార్యకర్తగా లింగమణి

- ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పురస్కారం
- వైద్యాధికారి మనోహర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేత

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** మండలంలోని కప్రాయపల్లి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త లింగమణి జిల్లా ఉత్తమ ఆశా వర్కర్‌గా ఎంపికయ్యారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి (డి.ఎం.హెచ్.ఓ) డాక్టర్ మనోహర్ చేతుల మీదుగా లింగమణికి ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. జనాభా నియంత్రణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో లింగమణి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కొనియాడారు. క్షేత్రస్థాయిలో ఆమె అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రకటించినట్లు తెలిపారు. ఈ పురస్కారంతో పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి) కీర్తి మరింత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ సుమన్ కళ్యాణ్, మండల వైద్యాధికారి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నకొండూరు రోడ్డులో విషాదం

- ఎలక్ట్రీషియన్ ఉరివేసుకుని ఆత్మహత్య
- తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చిన్నకొండూరు రోడ్డులో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న గంట శ్రీకాంత్ (27) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీకాంత్ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆయనను ఫ్యాన్‌కు వేలాడుతూ గుర్తించి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి గంట యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ కె. యాదగిరి దర్యాప్తు చేపట్టారు. శ్రీకాంత్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీకాంత్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. ముఖ్యంగా కుమారుడిని కోల్పోయిన తల్లి యాదమ్మ కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికులను కలచివేసింది.



# సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గ్రామ భద్రత

- ఎస్. లింగోటంలో చౌటుప్పల్ పోలీసుల అవగాహన సదస్సు
- త్వరలోనే కెమెరాలు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ హామీ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్, ఎస్ఐ యాదగిరి తమ సిబ్బందితో కలిసి శుక్రవారం ఎస్. లింగోటం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లు, కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల వద్ద సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత, వాటి ఏర్పాటు ఆవశ్యకతపై స్థానికులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సులో ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. వ్యాపార సంస్థల యజమానులు తమ దుకాణాల వద్ద తప్పనిసరిగా కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమం అనంతరం గ్రామ సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ, ఉపసర్పంచ్ బాతరాజు ధనుంజయ, గ్రామ పెద్దలు స్పందిస్తూ.. గ్రామంలోని కీలక ప్రాంతాలు, అవసరమైన ప్రదేశాల్లో వీలైనంత త్వరగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని పోలీసు అధికారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కిరాణా దుకాణాలు, హోటళ్ల యజమానులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# రెవెన్యూ ఒకరిది.. పెత్తనం మరొకరిది!



- రాచకొండ 'శ్రీ సరళ మైసమ్మ' క్షేత్రంలో కరవైన పారదర్శకత
- లక్షల ఆదాయం వస్తున్నా భక్తులకు మౌలిక సదుపాయాల కరువు
- సౌచాలయాలు లేక మహిళల అవస్థలు.. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆరోపణలు

**తొలివెలుగు, సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రాచకొండ శ్రీ సరళ మైసమ్మ దేవాలయం పరిపాలన, ఆదాయ వ్యయాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పనపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆలయం అధికారికంగా సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండ రెవెన్యూ పరిధిలో ఉన్నప్పటికీ, నిర్వహణ, టెండర్లు, పార్కింగ్ వసూళ్లు తదితర వ్యవహారాలు చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామానికి చెందిన వ్యక్తుల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిపాలనాపరమైన వైరుధ్యం కారణంగా ఆలయ అభివృద్ధి కుంటుపడుతోందని భక్తులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అనుమతులు లేని పార్కింగ్ వసూళ్లా?**

ప్రతి ఆదివారం, మంగళవారం వేలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తుండగా, వారి వాహనాల నుంచి పెయిడ్ పార్కింగ్ పేరిట భారీగా నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ద్విచక్ర వాహనాలకు రూ.20, కార్లకు రూ.50, భారీ వాహనాలకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నప్పటికీ, ఈ వసూళ్లకు సంబంధించిన అధికారిక అనుమతులు, టెండర్ వివరాలు లేదా ఆదాయ లెక్కలు ఎక్కడా ప్రదర్శించడం లేదని భక్తులు చెబుతున్నారు. పార్కింగ్ ద్వారా లక్షల రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ, పార్కింగ్ స్థలాన్ని సమతలం చేయడం, రహదారిని మరమ్మతు చేయడం వంటి పనులు చేపట్టలేదని విమర్శలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి పూర్తిగా దెబ్బతినగా, ఒక వాహనం గుంతలో ఇరుక్కుపోయిన ఘటన భక్తుల్లో ఆందోళనకు కారణమైంది.

**మౌలిక వసతుల లేమితో భక్తుల ఇబ్బందులు:**

ప్రతిరోజూ వందలాది మంది, పండుగల సమయంలో వేలాది మంది భక్తులు తరలివచ్చే ఈ ఆలయంలో కనీస సౌచాలయాలు లేక మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహిళా భక్తులు వాపోతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా తగిన స్థాయిలో లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ఆలయ పరిసరాల్లో మద్యం విక్రయాలపై విమర్శలు:**

పవిత్రమైన దేవాలయ పరిసరాల్లోనే బెల్ట్ షాపుల తరహాలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్, పోలీసు శాఖలు తగిన చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ భూముల ఆక్రమణల ఆరోపణలు:**

ఆలయ సమీపంలోని ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు, షెడ్లు, తాత్కాలిక దుకాణాలు నిర్మించి వాటిని నెలవారీ అద్దెలకు ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలకు రాజకీయ, అధికార వర్గాల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. వార్షిక టెండర్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించకుండా, పారదర్శకత లేకుండా నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



**సమగ్ర విచారణకు విజ్ఞప్తి:**

దేవాలయ పరిపాలన, పార్కింగ్ వసూళ్లు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, టెండర్ల నిర్వహణ వంటి అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

# 'హాస్టల్స్ హటావో.. 14వ వార్డ్ బచావో!'

- నిబంధనల ఉల్లంఘన, అసాంఘిక కార్యకలాపాలపై ఆరోపణలు
- సమగ్ర విచారణ జరపాలని మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి
- పోలీసు నిఘా పెంచాలని కోరిన కౌండిన్య నగర్, విశ్వకర్మ కాలనీ వాసులు



**తొలివెలుగు, చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో నివాస ప్రాంతాల నడుమ నడుస్తున్న కొన్ని మహిళా హాస్టళ్ల నిర్వహణపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వార్డు పరిధిలోని కౌండిన్య నగర్, విశ్వకర్మ కాలనీల్లో ఏర్పాటు చేసిన ఈ హాస్టళ్ల వల్ల కాలనీ వాసులు నిత్యం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై కాలనీకి చెందిన ప్రతినిధులు, బాధితులు శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఒక లిఖితపూర్వక ఫిర్యాదును సమర్పించారు. నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా హాస్టళ్లను నడుపుతున్నారని, రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తుల రాకపోకలు అధికమవడంతో పాటు కొన్ని హాస్టళ్లలో అసాంఘిక కార్యకలాపాలు సైతం చోటుచేసుకుంటున్నాయని స్థానికులు సదరు ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేశారు.

**పశాంతతకు విఘాతం.. వృద్ధులు, మహిళల అసౌకర్యం:**

కాలనీ వాసుల కథనం ప్రకారం.. నివాస గృహాల మధ్య ఉన్న ఈ హాస్టళ్ల వద్ద రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై కొందరు యువకులు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా చేరి గొడవలు చేయడం, న్యూసెన్స్ సృష్టించడం వల్ల కాలనీలో ప్రశాంత వాతావరణం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో కూడిన స్థానిక కుటుంబాలు బయటకు రావడానికి భయపడుతున్నాయని, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

**అనుమతులపై విచారణ జరపాలి:**

సదరు హాస్టళ్లు అన్ని రకాల అవసరమైన చట్టబద్ధమైన అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, భవన వినియోగ అనుమతులు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు తదితర నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరారు. నివాస ప్రాంతాల్లో ఇటువంటి వ్యాపార సంస్థల నిర్వహణకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తక్షణమే మున్సిపల్ యంత్రాంగం రంగంలోకి దిగి వాస్తవాలను పరిశీలించాలని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కాలనీలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని పెట్రోలింగ్ మరియు పోలీసు నిఘాను పటిష్టం చేయాలని, సీసీ కెమెరాల నిఘాను ఏర్పాటు చేసి కాలనీ ప్రశాంతతను పునరుద్ధరించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.




# చౌటుప్పల్‌లో సిపిఎం ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి

- ముఖ్య వక్తగా హాజరుకానున్న పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
- మండల కార్యదర్శి గంగాదేవి సైదులు పిలుపు



**తొలివెలుగు,చౌటుప్పల్ :** సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు చౌటుప్పల్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న ప్రాంతీయ సదస్సును పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ చౌటుప్పల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ బీవీ రాఘవులు ముఖ్య వక్తగా హాజరై, ఎస్ఐఆర్ (సర్) ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై విస్తృతంగా ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ?సదస్సు విజయవంతం కోసం శుక్రవారం పంతంగి, అంకిరెడ్డిగూడెం, ఎస్. లింగోటం, జైకేసారం, కుంట్లగూడెం, మందోల్లగూడెం, పెద్దకొండూరు, చిన్నకొండూరు, మల్కాపురం, తూప్రాన్ పేట, ఖైతాపురం, ధర్మోజిగూడెం గ్రామాల్లో పర్యటించి పార్టీ నాయకులకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాగిరి కిష్టయ్య, మండల కార్యదర్శి వర్గ సభ్యుడు బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు పొట్ట శ్రీనివాస్, పల్లె మధు, కృష్ణ బోదాస్, వెంకటేష్, ఎల్లమల్ల సంజీవ, జక్కిడి దేవేందర్ రెడ్డి, మీసాల శీను, శాఖల కార్యదర్శులు రత్నం శ్రీకాంత్, జక్కిడి రమణారెడ్డి, కొంతం శ్రీనివాస్ రెడ్డి, గుండ్ల మహేష్, పురుషోత్తం, తగరం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

- నిరసన తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై పార్టీ శ్రేణుల ఆగ్రహం

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం చౌటుప్పల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శంకుస్థాపన చేసిన ఈ ఆసుపత్రి పనులు సంవత్సరాలు గడుస్తున్నా నత్తనడకన సాగుతుండటం దురదృష్టకరమన్నారు. చౌటుప్పల్ ప్రాంతం ఆరు మండలాలకు కేంద్రంగా ఉండటంతో పాటు జాతీయ రహదారిపై ఉన్నందున ప్రతిరోజూ ఇక్కడ అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసర వైద్య సేవలకు ఈ ఆసుపత్రి ఎంతో కీలకమని పేర్కొన్నారు. నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల ప్రమాద బాధితులు, పేద ప్రజలు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి లక్షలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని, అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బందిని నియమించి ఆసుపత్రిని ప్రారంభించాలన్నారు. పనులు వేగవంతం చేయకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


భారతీయులు ఎవరినైనా ప్రేమిస్తే గుండెల్లో స్థానం ఇస్తారు. ఆ ప్రేమ పెరిగిపోతే గుడి కూడా కట్టేస్తారు. ఇప్పుడు యువభారత్లో సంచలన ఆటగాడు వైభవ్ సూర్య వంశీ కి అభిమానులు కచ్చితంగా గుడి కడతారు. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు..ఐపీఎల్ లో ఆడుతున్నప్పుడు రాజస్థాన్ జట్టు తరుపున సెంచరీ చేశాడు వైభవ్ సూర్య వంశీ. కేవలం 14 సంవత్సరాలు దాటని వయసులో అతడు ఆ ఘనత అందుకున్నాడు. ప్రపంచ స్థాయి మేటి బౌలర్లను ఓడించి సత్తా చూపించాడు. తద్వారా తను ఎంత ప్రమాదకరమైన ఆటగాడినో నిరూపించాడు.



# ఈ బుడ్డోడు.. ఫ్యూచర్ భారత్

వైభవ్ సూర్య వంశి. అతడికి ఇంకా నూనూగు మీసాలు కూడా రాలేదు. తన తోటి పిల్లలు పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పడుతుంటే.. ఇతడేమో బ్యాట్ చేత పట్టుకొని ఆడుతున్నాడు. పాఠశాలలకు బదులుగా నెట్స్ లో తీవ్రంగా సాధన చేస్తున్నాడు. టోర్నీల పేరుతో దేశ విదేశాలు తిరుగుతున్నాడు. అతడు ఇప్పుడు ఏకంగా భారత జట్టుకు భవిష్యత్తు ఆశాకిరణం మాదిరిగా కనిపిస్తున్నాడు.ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేశాడు. టీం ఇండియాను విజేతగా నిలిపాడు. అయితే ఇంతటితోనే వైభవ్ సూర్య వంశీ ఆగిపోలేదు. అనేక రికార్డులను బద్దలు కొట్టాడు. ముఖ్యంగా పాకిస్తాన్ క్రికెటర్ బాబర్ ఆజామ్ సాధించిన ఘనతను జస్ట్ పక్కన పెట్టాడు. విధ్వంసానికి పరాకాష్టగా బ్యాటింగ్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు.వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేయడం ద్వారా అనేక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అండర్ 19 వరల్డ్ కప్ ప్లే ఆఫ్ లో తొలిసారి 150o పరుగులు చేసిన ఆటగాడిగా వైభవ్ సూర్య వంశీ నిలిచాడు. 2014లో దుబాయ్ లో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్ ఆటగాడు నికోలస్ పూరన్ 143 పరుగులు చేశాడు. 2012లో జరిగిన ఫైనల్ మ్యాచ్లో ఆస్ట్రేలియా పై భారత ఆటగాడు ఉన్ముక్త్ 111లి పరుగులు చేశాడు.2002 లో ఇంగ్లాండ్ జట్టుపై అంబటి రాయుడు 177లి పరుగుల తర్వాత యూత్ వన్డేలో వైభవ్ సూర్య వంశీ చేసిన 175 పరుగులు.. సెకండ్ హైయెస్ట్ స్కోర్ గా కొనసాగుతున్నాయి. గత ఏడాది డిసెంబర్లో దుబాయ్ లోని యూఏఈ జట్టుపై సూర్యవంశీ 171 పరుగులు చేశాడు. తద్వారా ఈ జాబితాలో రెండు, మూడు స్థానాలలో అతడు కొనసాగుతున్నాడు..వైభవ్ సూర్య వంశీ వయసు ప్రస్తుతం 14 సంవత్సరాల 316 రోజులు. అండర్ ప్రపంచ కప్ లో ఫైనల్ మ్యాచ్లో సెంచరీ చేసిన అతి తక్కువ వయసున్న ఆటగాడు గతంలో ఈ రికార్డు పాకిస్తాన్ ఆటగాడు బాబర్ అజామ్ పేరు మీద ఉండేది. 2010లో వెస్టిండీస్ జట్టుపై 15 సంవత్సరాల 92 రోజుల్లో అతడి సెంచరీ చేశాడు. సూర్య వంశీ (4), నజ్ముల్(1) మాత్రమే 15 సంవత్సరాలు నిండకముందు యూత్ వన్డేలలో సెంచరీలు సాధించారు.గత ఏడాది డిసెంబర్లో విజయ్ హజారే ట్రోఫీలో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై జరిగిన మ్యాచ్లో వైభవ్ సూర్య వంశీ 14 సంవత్సరాల 272 రోజుల వయసులో సెంచరీ చేశాడు.వైభవ్ సూర్య వంశీ 55 బంతుల్లో సెంచరీ చేశాడు. అయితే ఇతర కంటే ముందు విల్ మలాజ్ జుక్ అనే ఆస్ట్రేలియా క్రీడాకారుడు ఈ ఏడాది జరిగిన మ్యాచ్లో జపాన్ మీద 51 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. పాకిస్తాన్ ఆటగాడు కాసిం అక్రమ్ శ్రీలంక మీద 63 బంతుల్లో సెంచరీ చేశాడు. బెన్ మేయెస్ అనే ఇంగ్లాండ్ ఆటగాడు స్కాట్లాండ్ మీద ప్రస్తుత అండర్ 19 వరల్డ్ కప్ లో 65 బంతుల్లో సెంచరీ చేశాడు. భారతదేశానికి చెందిన రాజ్ బవా అనే ఆటగాడు 2022లో ఉగాండా జట్టుపై 69 బంతుల్లో సెంచరీ చేశాడు.

పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృధా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టటం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్దతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది.



# గాడితప్పతున్న పార్లమెంట్ సమావేశాలు!

కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్ధతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుం టోంది. అయితే దీనికి కొన్ని రూల్స్ ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷-కే చెల్లింది. అమెరికా -భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపోస్సోషల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే-వద్దని అడ్డం పడ్డాది. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండాలో, కూడదో అదే నిర్దేశించాలని చూశారు. . ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవొంచకూడదని నిర్ణయించి, ఇంతకాలం ట్రేడ్ డీల్ను పక్కన పెట్టింది. పాకిస్తాన్-ఇండియా యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ అనేకసార్లు ప్రకటించుకున్నా, భారత్పై సుంకాలను భారీగా విధించినా, అక్రమ వలసల పేరిట భారతీయులకు సంకెళ్లు వేసి, దేశంలో దించిపోయినా- భారత్ ఓపిక పట్టింది. ఇప్పుడు కూడా ట్రంప్ ప్రకటించేదాకా ఒప్పందంపై మనం ముందుకు రాలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక-తన దారిలోకి రాని దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించటం ఒక వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలిగించారు. అయితే ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదురవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో సమాధానం చెప్పాయి. నీకు మేమంత దూరమో మాకు నువ్వూ అంతే దూరం అని సమాధానం ఇచ్చాయి. భారత్ కూడా అదే పద్ధతిని అవలంబించింది. మోడీ ప్రభుత్వం ఏ మాత్రం లొంగుబాటుకు ఒప్పుకోలేదు. మనపట్ల అమెరికాలోనే సానుకూలత వ్యక్తం అయ్యింది. అమెరికాలో ఒత్తిడి తట్టుకోలేక ట్రంప్ భారత్తో ఓ రకంగా కాళ్ళ బేరానికి వచ్చాడని చెప్పుకోవాలి. అంతేగానీ భారత్ పరువు పోయిందని, మోడీ లొంగిపోయాడని విమర్శించే వారికి అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవను కోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ముందున్నారు. ట్రంప్ బెదరింపులకు లొగివుంటే ఎప్పుడో ఒప్పందం ఖరారు అయ్యేది. అయితే ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాదని ఎవరూ అనడం లేదు. పార్లమెంటులో చర్చకు ముందే గలాభా సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ పైత్యాన్ని చాటుకుంది. మోడీ ప్రకటన చేసే వరకు ఆగాలి. తాము కోరుకున్నట్లు ఇప్పుడే..ఈ క్షణమే చర్చ జరగాలని అనుకోవడం దుర్మార్గం తప్ప మరోటి కాదు.



# పవన్ కు ఫుల్ పవర్స్...

పవన్ కళ్యాణ్ కు బిజెపి పెద్ద బాధ్యత అప్పజెప్పినట్లు ప్రచారం నడుస్తోంది. ఇటీవల పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను కలిశారు. కీలక చర్చలు జరిపారు. అమిత్ షా కేవలం మంత్రి మాత్రమే కాదు. బిజెపి రాజకీయ వ్యూహకర్త. ఆపై బిజెపిలో ఆయన పాత్ర కీలకం. అయితే పవన్ ఢిల్లీ పర్యటనలకు ఎప్పుడూ దూరంగా ఉంటారు. అటువంటి పవన్ కళ్యాణ్ ను ఢిల్లీకి పిలిపించుకుని మరి కీలక బాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం నడుస్తోంది. మరోవైపు రెండు నెలల్లో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల్లో అక్కడ ఓటు శాతాన్ని పెంచుకుంది బిజెపి. సీట్ల పరంగా ఒక్క స్థానం రాకున్నా ఓట్లు మాత్రం గణనీయంగా పెరిగాయి. అందుకే ఈసారి అక్కడ పట్టు బిగించాలని బిజెపి చూస్తోంది. ఇప్పటికే పలని స్వామి నేతృత్వంలోని డీఎంకే ఎన్డీఏ లోకి వచ్చింది. దినకరన్ పార్టీ సైతం పొత్తుకు ముందుకు వచ్చింది. అయితే అనూహ్యంగా తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే 12 శాతం వరకు ఓట్లు సొంతం చేసుకుంటుందని సర్వేల్లో తేలుతోంది. అదంతా డిఎంకె కూటమి వ్యతిరేక ఓటు. అయితే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే విజయ్ ను ఎన్డీఏలోకి తేవాలని బిజెపి పెద్దలు భావించారు. ద్రవిడ సిద్ధాంతానికి వ్యతిరేకంగా బిజెపి ఉండడంతో.. తనకు రాజకీయంగా ఇబ్బంది తప్పదని విజయ్ భయపడుతున్నారు. అందుకే ఎన్డీఏలో చేరేందుకు ఇష్టపడడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో తమిళనాడులో బలమైన చరిష్మ కావాలి అంటే పవన్ అవసరం ఏర్పడింది బిజెపికి. పైగా అక్కడ తెలుగు వారి ప్రభావం ఎక్కువ. అందుకే పవన్ కళ్యాణ్ కు తమిళనాడు ఎన్నికల్లో ఎన్డీఏ ఇన్చార్జిగా నియమించాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ముందుగా తెలంగాణ ఎన్నికల్లో ప్రచారం.. తరువాత తమిళనాడు ఎన్డీఏ ఇన్చార్జిగా ప్రకటన ఉంటుందని ప్రచారం నడుస్తోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలిఅయితే పవన్ ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత తెలంగాణ బిజెపి నేతలు కలిశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన మద్దతును కోరారు. మద్దతు ఇవ్వడమే కాదు బిజెపి తరఫున ప్రచారానికి కూడా పవన్ కళ్యాణ్ సిద్ధమని ప్రకటించారు.వాస్తవానికి తెలంగాణలో జనసేన పోటీ చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు ప్రారంభించింది. అప్పటివరకు ఉన్న అన్ని కమిటీలను రద్దు చేశారు. రామ్ తాళ్లూరి నేతృత్వంలో కొత్త కమిటీల ఎంపిక ప్రక్రియ ప్రారంభం అయింది. అందులో కొత్త వారికి అవకాశం ఇచ్చి తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో యువతకు టికెట్లు ఇవ్వడం ద్వారా పార్టీని బలోపేతం చేసుకోవాలన్న ఆలోచనకు వచ్చారు. ప్రజాబలం ఉండి ప్రధాన రాజకీయ పార్టీల తరఫున టికెట్లు దొరకని వారికి జనసేన టికెట్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇప్పటికే ప్రధాన నగరాలతో పాటు పట్టణాల్లో జనసేన అభ్యర్థులు పోటీకి దిగారు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ బిజెపికి మద్దతు తెలపడంతో ఆ రెండు పార్టీల మధ్య ఒక అవగాహన వచ్చే అవకాశం ఉంది.

# అఫెన్స్ మూడ్ లోకి కల్తీ నెయ్యి,...

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా ప్రకంపనలు సృష్టిస్తున్న కల్తీ నెయ్యి వ్యవహారం, అనూహ్యంగా అధికార కూటమి పార్టీల మధ్య సరికొత్త ఐక్యతకు పునాది వేసింది. విపక్షాల విమర్శలు, సాంకేతిక అంశాల నడుమ కొంత డిఫెన్స్ ధోరణిలో ఉన్నట్లు కనిపించిన టీడీపీ, జనసేన, బీజేపీలు ఇప్పుడు ఎదురుదాడికి సిద్ధమయ్యాయి. తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక ఆధ్యాత్మిక భావోద్వేగ అంశంగానే కాకుండా, రాజకీయ అస్తిత్వ పోరాటంగా మారింది. ఆరంభంలో ఈ విషయంలో కొంత తడబడినట్లు కనిపించిన అధికార కూటమి, ఇప్పుడు పూర్తిస్థాయి అప్రమత్తతతో విపక్షాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది.కల్తీ నెయ్యి అంశంలో సిట్ విచారణ, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు, సీబీఐ ప్రమేయం వంటి అంశాలను అస్త్రాలుగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్లు ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని కూటమి నిర్ణయించింది. కేవలం ప్రభుత్వపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా గట్టి సమాధానం ఇవ్వకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని గ్రహించిన కూటమి నేతలు, గురువారం ఉమ్మడిగా మీడియా ముందుకు రావడం ఒక కీలక మలుపు.వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మూడు పార్టీల ప్రతినిధులతో కూడిన ఒక అంతర్గత సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన భాగం. క్షేత్రస్థాయిలో ప్రజలకు కల్తీ జరిగిన తీరును, గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెండర్ల ప్రక్రియను వివరించాలని నిర్ణయించాయి. సిట్ విచారణలో వెల్లడవుతున్న కీలక అంశాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకురావాలని, సోషల్ మీడియాలో విపక్షాలు చేస్తున్న నెగటివ్ ప్రచారాన్ని మూడు పార్టీల ఐటీ విభాగాలు సమన్వయంతో తిప్పికొట్టాలని తీర్మానించాయి.ఈ అంశంలో పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష హిందూ ధర్మ పరిరక్షణ కోణంలో ప్రజల్లోకి బలంగా వెళ్లింది. దీనికి బీజేపీ జాతీయ స్థాయి మద్దతు కూడా తోడవడంతో, కూటమి మధ్య సైద్ధాంతిక సారూప్యత మరింత పెరిగింది. చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ భావోద్వేగ సందేశం, బీజేపీ జాతీయ అండదండలు కలగలిసి వైసీపీని రాజకీయంగా ఇరకాటంలోకి నెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.సాధారణంగా కూటమి ప్రభుత్వాల్లో పార్టీల మధ్య చిన్నపాటి భేదాభిప్రాయాలు సహజం. కానీ, ఈ నెయ్యి కల్తీ వ్యవహారం ఆ గ్యాప్ను పూడ్చేందుకు ఉపయోగపడింది.